క్లుప్తంగా

బొడ్రాయి వేడుకల్లో ఎమ్మెల్యే పూజలు



బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ : మండలంలోని సామగానితండాలో బొడ్రాయి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవాలయం వద్ద విక్రయాలకు వేలం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కల్లెపల్లి బంగారు మైసమ్మ దేవాలయం వద్ద 2024–25 సంవత్సరానికిగాకి లడ్డూ, పులిహోరా, తలనీలాలు, కొబ్బరికాయలు విక్రయించుకునేందుకు ఈనెల 7న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ధీరావత్ భాష్యానాయక్, ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు విక్రయానికి రూ.లక్ష డిపాజిట్, పూలదండలు, నిమ్మకాయలు, కొబ్బరిచిప్పలు సేకరించుకునే, తలనీలాలు సేకరించుకునే, లడ్డూ ప్రసాదం అమ్ముకునే హక్కుకై రూ.50వేల డిపాజిట్ చెల్లించాలని వారు పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణ



ప్రభాకర్

దేవరకొండ : లయన్స్ క్లబ్ దేవరకొండ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వస్కుల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్లబ్ ప్రధాన కార్యదర్శిగా సముద్రాల ప్రభాకర్, కోశాధికారిగా చిలుకూరు నిరంజన్‌లు ఎన్నికైనట్లు క్లబ్ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన సత్యనారయణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం నూనతంగా ఎన్నికైన సభ్యులను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో శాంసన్, రాజేష్, చీదెళ్ల వెంకటేశ్వర్లు, వనం భిక్షమయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ముత్తిరెడ్డికుంటకు చెందిన నాయీ బ్రాహ్మణుడు యాదగిరి అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం యాదగిరి మృతదేహాన్ని నాయీ ఫిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు రూ3వేల ఆర్థిక సాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో అసోసియేషన్ సభ్యులు రాంచరణ్, సంతోష్, సాయి, ప్రశాంత్ వెంకట్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం



గాంధీనగర్‌లో ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న మహిళలు, నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు ప్రతి నెలా తన వేతనాన్ని అందజేస్తానని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జ్ ఉబ్బపల్లి కాశయ్య ఆధ్వర్యంలో మహిళలు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉబ్బపల్లి సైదులు, దైద నాగరాజు, దైద గణేష్‌లతో పాటు మహిళలు తదితరులున్నారు.

నాగయ్య మృతి తీరని లోటు

హుజూర్‌నగర్ : టీడీపీ నాయకుడు జడ నాగయ్య మృతి పార్టీకి తీరని లోటని టీఎన్‌టీయూసీ నాయకుడు శీతల రోషపతి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని ముగ్దూంనగర్‌కు చెందిన నాగయ్య ఇటీవల ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందారు. సోమవారం ఆయన నాగయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుని కుటంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మారెడ్డి, కృష్ణ, వెంకి, లచ్చిరెడ్డి, చిన్ననాగయ్య, రమాదేవి, రాజేష్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చేలా..

- మహిళా సంఘాలకు విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యత
- ఒక్క జతకు రూ.20 చెల్లింపు
- మున్సిపాలిటీలో 3972 మంది విద్యార్థులకు దుస్తుల తయారీ





శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో స్కూల్ యూనిఫాంలు కుడుతున్న మహిళలు

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే యూనిఫాంలను కుట్టేందుకు ఈ సారి మహిళా సంఘాలకు అప్పగించింది ప్రభుత్వం. గతంలో ఇదే పనిని గుత్తేదారులకు ఇచ్చేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల ఆర్థికాభివృద్ధిని ఆలోచించి దుస్తులు కుట్టే పనిని మహిళా సంఘాల అప్పగించింది. వీటిని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పర్యవేక్షిస్తోంది.

మున్సిపాలిటీలో 29 పాఠశాలలు 3972 మందికి

మిర్యాలగూడ మున్సిపాలిటీలోని 29 సర్కార్ బడుల్లో బాల బాలికలకు కలిపి మొత్తం 3వేల 972 మంది ఉన్నారు. వీరికి దుస్తులను కుట్టేందుకు 90 మంది మహిళలకు బాధ్యతలు అప్పగించారు. ఇందుకు సంబంధించిన వస్త్రం ప్రభుత్వమే అందజేస్తుంది. ముత్తిరెడ్డికుంట, శాంతినగర్‌లలో ఏర్పాటు చేసిన కుట్టు కేంద్రంలో 30మంది కుట్టుతుండగా మరో 60మంది మహిళలు తమ ఇళ్ల వద్దనే కుట్టుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 1800 మందికి పైగా దుస్తులను కుట్టారు. ఒక్క యూనిఫాం కుడితే ప్రభుత్వం రూ.20 మాత్రమే చెల్లిస్తుందని, ఈ ధర గిట్టుబాటు కావడం లేదని మహిళలకు పేర్కొంటున్నారు.

మెప్మా ఆధ్వర్యంలో..

మున్సిపల్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ముత్తిరెడ్డికుంట, శాంతినగర్‌లలోని కమ్యూనిటీ హాళ్లల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాంలు కుట్టిస్తున్నారు. ఈ బాధ్యతలను మెప్మా టీఎల్ఎఫ్‌లకు అప్పగించారు.

గిట్టుబాటు కావడం లేదు



విద్యార్థులకు దుస్తులు కుట్టే పనిని అప్పగించడం వల్ల ఎంతో కొంత ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రతిసారి ఇదే విధంగా మహిళలకు పనులను అప్పగిస్తే బాగుంటుంది. కుట్టు శిక్షణ పూర్తి చేసి ఎలాంటి పనులు లేకుండా ఖాళీగా ఉంటున్నవారికి ఇదో మంచి అవకాశం. అయితే కేవలం 20 రూపాయలు మాత్రమే ఇవ్వడంతో ఎలాంటి గిట్టుబాటు లేకుండా పోయింది. – ఆర్. నాగమణి, శాంతినగర్, మిర్యాలగూడ

గడువులోగా అందిస్తాం



అధికారులు తెలిపిన గడువులోగా విద్యార్థులకు యూనిఫాంలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మెప్మా సీఓలు ముత్తిరెడ్డికుంట, శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన కుట్టు కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. కుట్టు పని వేగవంతంగా సాగుతోంది. మహిళ సంఘాలకు ఇదో మంచి అవకాశం. – పాతేపాక బక్కయ్య, మెప్మా టీఎంసీ, మిర్యాలగూడ

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. వారం రోజులుగా పట్టణంలో నిర్వహించిన దేవరకొండ ప్రీమియర్ లీగ్ సీజన్–3 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌లో మొత్తం 32టీంలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్‌గౌడ్, ఎంఏ సిరాజ్‌ఖాన్,పున్న వెంకటేష్,కిన్నెర హరికృష్ణ, వెంకటేష్‌గౌడ్, నిర్వాహకులు హన్మంతు సాయిచంద్ర, కార్తీక్, రమేశ్, నందు, అభిషేక్, తదితరులున్నారు.

ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం

నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంలో సోమవారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైకిల్ మెకానిక్‌లు అఫ్జల్, సైదులును క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం క్లబ్ మాజీ అధ్యక్షుడు కందిబండ శ్రీనివాస్‌రావు, క్లబ్ కోశాధికారి యూసుఫ్‌లు మాట్లాడారు. పేదవాడి వాహనం అయిన సైకిల్ ప్రస్తుతం మానవుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా మారిందని అన్నారు. సైకిల్ తొక్కడం వలన వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు మెరుగైన ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సోమప్ప ఆలయం మాజీ కమిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ



బెక్కం పవన్



దువ్వ ప్రేమ్‌చంద్



కొర్ర నితిన్



శృతి

కొండమల్లేపల్లి : పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్–2024 ఫలితాలలో కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చరు. పాఠశాలకు చెందిన బెక్కం పవన్ 120 మార్కులకు గాను 113 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 149 ర్యాంక్, ఎటెల్లి శృతి 99 మార్కులతో 1,345 ర్యాంకు, దువ్వవ ప్రేమ్‌చంద్ 76 మార్కులతో 7291 ర్యాంక్ సాధించారు. కొర్ర నితిన్ 74 మార్కులతో 8,437 ర్యాంకును సాధించారు. కాగా వేసవి కాలంలో గణిత ఉపాధ్యాయుడు కొలనుపాక శ్రీపతిరావు జూమ్ ద్వారా ఉచిత శిక్షణ అందించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్‌ఎం చేరుపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, సూర్యనాయక్, సైదానాయక్, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, జగదీశ్, లోక్యనాయక్ ఉన్నారు.

మహిళా సమస్యలపై రాజీలేని పోరాటం



నేరేడుచర్లలో మహిళా సమాఖ్య జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి

నేరేడుచర్ల : మహిళా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేసేది మహిళా సమాఖ్య మాత్రమేనని ఆ సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి అన్నారు. సోమవారం నేరేడుచర్లలో జాతీయ మహిళా సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జెండాను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో మహిళల కోసం ఒక సంఘం ఉండాలని, ఆనాటి ప్రముఖ మహిళా కమ్యూనిస్ట్ యోధురాలు స్థాపించిన సంఘమే మహిళా సమాఖ్య అని అన్నారు. ఆనాడు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును సీపీఐ నాయకురాలు, పార్లమెంటు సభ్యురాలు గీత ముఖర్జీ ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలలని సమాఖ్య ఉద్యమిస్తుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లను పర్మినెంటు చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకురాళ్లు నాగలక్ష్మి, సత్యవతి, శ్రావణి, సైదమ్మ, అరుణ, ఆశాబేగం, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

ఘనంగా మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం

హుజూర్‌నగర్ : న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం కోసం జాతీయ మహిళా సమాఖ్య పోరాటం కొనసాగిస్తుందని సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని జంగిడి సెంటర్‌లో మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు పశ్య పిచ్చమ్మ జెండా ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతీయ మహిళా సమాఖ్య ఏర్పడి 70 వసంతాలు అవుతుందని తెలిపారు. విద్య, ఉపాధి, ఆహార భద్రత, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, సాంఘిక భద్రత పొందడంలో మహిళలు పోరాటం కొనసాగించాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకురాళ్లు పశ్య మంగమ్మ, ఎస్‌కె.ఫాతిమా, కుర్ర లింగమ్మ, శ్రావణి, మునగ లింగమ్మ, పుల్లమ్మ, వీరమ్మ, వెంకమ్మ, జాన్సీ, జడ వెంకటమ్మ, మునగ మంగమ్మ, ఇందిరాల సంధ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం



ఏరియా ఆస్పత్రికి వెళ్లే రోడ్డు జలమయం



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీరు



మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లిన వర్షపు నీరు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలోని ఏరియా ఆసుపత్రి రోడ్డుతో పాటు మున్సిపాలిటీ ఆవరణ జలమయమైంది. ఏరియా ఆసుపత్రికి వెళ్లే రోడ్డులో నిత్యం రద్దీగా ఉండటంతో వర్షపు నీటితో వాహనాదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా వాహనాల రాకపోకల తాకిడి పక్కనే ఉన్న మున్సిపాలిటీ కార్యాలయం అవరణలో వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో మున్సిపల్ గేటు మూసి వేశారు. వర్షపు నీరు నిల్వ ఉండటంతో మున్సిపల్ సిబ్బంది వాహనాలు పెట్టుకునేందుకు కొంత ఇబ్బందిగా మారింది. అదే విధంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ఒక వైపు ప్రయాణికులు, మరో వైపు ద్విచక్రవాహనాదారులు, పాదాచారులు ఇబ్బందులు పడ్డారు.

బస్తీ దవాఖానాల్లో డాక్టర్లేరి?

మిర్యాలగూడ టౌన్ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసి బస్తీ దవాఖానాల్లో డాక్టర్లు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో వ్యవసాయ మార్కెట్, షాబునగర్, ఇందిరమ్మ కాలనీల్లో ఈ బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారు. కానీ సిబ్బందిని మాత్రం నియమించలేదు. ఈ దవాఖానాలకు రోజు 60 నుంచి 80మంది వరకు రోగులు వస్తుంటారు. కానీ అక్కడ వైద్యం చేసే వారు మాత్రం లేరు. కేవలం ఒక స్టాఫ్ నర్సు, మందులు మాత్రం ఉన్నాయి. డాక్టర్లను ఏర్పాటు చేస్తే ఈ బస్తీ దవాఖానాలను అందరూ సద్వినియోగం చేసుకుంటారని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.



షాబునగర్‌లోని బస్తీ దవాఖానా

తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే



బీఆర్ఎస్ కార్యాలయంలో గులాబీ జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ దేనని మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, నాయకులు నూకల సరళహన్మంతరెడ్డి, ఆంగోతు లలితహాతీరాంనాయక్, బైరం బుచ్చయ్య, ధనావత్ చిట్టిబాబునాయక్, మోసిన్‌అలీ, పెండ్యాల పద్మ, వెలిశెట్టి రామకృష్ణ కట్టా మల్లేష్‌గౌడ్, కృపాకర్‌రావు, ఇలియాస్, జొన్నలగడ్డ రంగారెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఎం.షోయబ్, సైదులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి జాతర



జాతరకు ముస్తాబైన ఆలయం

వేములపల్లి : ఈనెల 5వ తేదీ నుంచి శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి జాతరను నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు జిన్న నాగిరెడ్డి, అవిరెండ్ల వేణులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రావులపెంట గ్రామంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి వారి 14వ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జాతర సందర్భంగా ఈనెల 5, 6 తేదీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి కోటీల పోటీలు, 6న సుప్రభాత సేవ, మంగళ తోరణాలు, విగ్రహాలకు అభిషేకాలు, 7న అమ్మవారికి బోనాలు, కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం మిర్యాలగూడ, సూర్యాపేట డిపోల నుంచి బస్సులను నడపనున్నట్లు తెలిపారు.

కొండమల్లేపల్లిలో భారీ వర్షం



గౌరికుంటతండాలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



వర్షానికి తడిసిన కరెన్సీ నోట్లు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. కొండమల్లేపల్లి మండల పరిధిలోని గౌరికుంటతండాలో వీధుల గుండా మోకాళ్ల లోతు నీళ్ల ప్రవహించడంతో తండావాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఇళ్లలోని సామగ్రి, బియ్యం, జొన్నలు, డబ్బులు నీటిలో తడిసిపోయాయి. కొండమల్లేపల్లి జెడ్పీటీసీ సలహాదారుడు పస్నూరి యుగేందర్ రెడ్డి సోమవారం వీధులగుండా తిరుగుతూ ఇళ్లల్లో చేరిన నీటిని పరిశీలించారు.

ఉపాధి కూలీల దినసరి వేతనం పెంచాలి



ఎంపీడీఓ స్వామికి వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మాడుగులపల్లి : ఉపాధి హామీ కూలీల దినసరి వేతనం పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మన్నెం భిక్షం, గండమళ్ల రాములు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వారు పర్యటించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ స్వామికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. ఏటా పథకానికి నిధులు తగ్గిస్తూ పేదలకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. పథకాన్ని రద్దు చేసి వలసలను ప్రోత్సహించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని ఆక్షేపించారు. కార్యక్రమంలో వ్య.కా.స మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారి, కార్యదర్శి వెంకటయ్య, నాగయ్య, కృష్ణయ్య, వంశీకృష్ణ, శ్రీను, పవన్, పాల్గొన్నారు.


బైపాస్ రోడ్డు నిర్మాణంతోనే అభివృద్ధి

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణం మధ్యలోనుంచి కాకుండా బైపాస్ రోడ్డు నిర్మించడం ద్వారానే పట్టణం అభివృద్ధి చెందుతుందని సీపీఎం నాయకులు సయ్యద్ హాశం, ఎండీ.సలీం అన్నారు. సోమవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రిటైర్డు ఉద్యోగులు, వ్యవసాయదారులు, పిల్లల భవిష్యత్ కోసం కొనుగోలు చేసిన ప్లాట్లకు నష్టం జరగకుండా వ్యవసాయ భూములను మాత్రమే సేకరించే విధంగా ప్రతిపాదన చేయాలన్నారు. రాజకీయ లబ్ధి కోసం కాకుండా ప్రజలకు మేలు జరిగే విధంగా బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, అద్దంకి నరసింహ, కుంభం కృష్ణారెడ్డి, అలీ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

హుజూర్‌నగర్ : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ చరమందరాజు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని రైతు వేదికలో నియోజకవర్గంలోని విత్తన డీలర్లు, వ్యవసాయ అధికారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే విత్తనాలను విక్రయించాలని చెప్పారు. అధిక ధరకు అమ్మినా, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఏడీఏ సంధ్యారాణి మాట్లాడుతూ.. విత్తనాల విక్రయాలకు సంబంధించి డీలర్లు ప్రత్యేక రిజిస్టర్లలో రైతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. సీల్ చేసిన విత్తనాల ప్యాకెట్లను విక్రయించాలని, విడిగా అమ్మకూడదని చెప్పారు. అక్రమాలకు పాల్పడితే షాపులు సీజ్ చేస్తామని, లైసెన్స్‌లు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముత్తయ్య, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

గుట్కాదందాను అరికట్టాలి



మాట్లాడుతున్న రుషికేశ్వర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలో గుట్కా దందాను అరికట్టాలని సామాజిక కార్యకర్తలు సరికొండ రుషికేశ్వర్‌రాజు, చిలుముల కొండల్, దేవులపల్లి కార్తీక్ అన్నారు. సోమవారం గుట్కాదందాపై పోలీసులు, ఎక్సైజ్, ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానంగా గుట్కా, పాన్ మసాల, టోబాకో, నికోటిన్ వంటివి పట్టణంలోని విక్రయిస్తున్నారని, వాటిని నిషేదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీఓ సైతం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి గుట్కా దందాను పూర్తిగా అరికట్టేంందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన హాకీ శిక్షణ శిబిరం



శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులు

చిట్యాల: యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న క్రీడా శిబిరాల్లో శిక్షణ పొందిన క్రీడాకారులు అన్ని రకాల పోటీల్లో రాణించాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి మక్బూల్ అహ్మద్ అన్నారు. ఉరుమడ్ల గ్రామంలో యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత హాకీ క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం క్రీడాకారులకు శిక్షణ పత్రాలను ఆయన అందజేశారు. అదేవిధంగా శిక్షణ పొందిన క్రీడాకారులకు జెడ్పీటీసీ సుంకరి ధనమ్మయాదగిరిగౌడ్, ఎంపీటీసీ పెద్ద బోయిన సత్తయ్య యాదవ్ సాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో కోచ్ గంగాపురం రాము, కొండ పరమేష్, మర్రి కల్పన, జన్నపాల కిషన్, కొయ్యడి సత్యనారయణ, వెంకటేష్, పాల్గొన్నారు.

‘బుసిరెడ్డి’ సహకారంతో చెరువులోకి నీరు



ఫీడర్ చానల్ ద్వారా పోచంపల్లి చెరువులోకి ప్రవహిస్తున్న నీరు



పోచంపల్లి చెరువులో చేరిన నీరు

- బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీడర్‌చానల్‌లో పూడికతీత
- భారీ వర్షంతో పోచంపల్లిలోని మాధవరావు చెరువులోకి వర్షపు నీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆ గ్రామ రైతులు

గుర్రంపోడు : జూన్ నెలలో ఎప్పుడూ నీళ్లు లేని పోచంపల్లి మాధవరావు చెరువులోకి ప్రస్తుత వర్షాలతో నీరు వచ్చి చేరుతుంది. ఇటీవల బుసిరెడ్డి ఫౌండేషన్ సహకారంతో ఆ ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి సొంత ఖర్చుతో ఫీడర్‌చానల్‌లో పూడికతీయించడంతో దాని ద్వారా చెరువులోకి ఎలాంటి అడ్డంకి లేకుండా నీళ్లు వస్తున్నాయి. దీంతో ఆ గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పక్కనే ప్రవహిస్తున్న శిశిలేటి వాగుపై కత్వ నుంచి మూడు కిలోమీటర్ల కాల్వను ఇటీవల రైతుల కోరిక మేరకు బుసిరెడ్డి పాండురంగారెడ్డి కంపచెట్లు తొలగించి పూడిక తీయించారు. గతంలో ఈ మూడు కిలోమీటర్ల కాల్వను మరమ్మత్తు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ఫలితం లేకపోయింది. పూడిక తీతతో ఆదివారం రాత్రి గుర్రంపోడు మండలంతోపాటు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి వాగు ప్రవహించి నీరు వేగంగా చేరడంతో 70 శాతం చెరువు నిండటంతో గ్రామస్తులు చెరువు వద్దకు ఉదయమే చేరుకుని సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా బుసిరెడ్డి పాండురంగారెడ్డి సేవలను గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, రైతులు కొనియాడారు.